సర్ పై క్షేత్రస్థాయిలో పరిశీలించండి: ప్రణవ్

❖ నియోజకవర్గ స్థాయి కో-ఆర్డినేటర్లతో ముఖ్య సమావేశాన్ని నిర్వహించిన ప్రణవ్

❖ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

దశ, హుజురాబాద్: హుజురాబాద్ పట్టణ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సర్ కో ఆర్డినేటర్ల ముఖ్య సమావేశంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్ లో ఓట్ల సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని,ప్రతీ ఓటరు ముఖ్యం కాబట్టి బూత్ లెవెల్ ఏజెంట్లతో నిరంతరం మాట్లాడాలని కోరారు. క్రింది స్థాయిలో జరిగే సరళిని రాష్ట్ర పీసీసీ పరిశీలిస్తున్నారని,ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్లను కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి నియోజవర్గ స్థాయి ఇంచార్జ్ లకు,బిఎల్ఓ,సంబంధిత అధికారులకి సమాచారం అందించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం,కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో మొదటి స్థాయిలో ఉండేలా ప్రతి కార్యకర్త,బిఎల్ఏ,కో ఆర్డినేటర్లు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా ఉపాధ్యక్షుడు,సర్ నియోజవర్గ కో ఆర్డినేటర్ సదయ్య,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,కో ఆర్డినేటర్లు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్.. యువకుడికి తీవ్ర గాయాలు

దశ,పినపాక : వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తో యువకుడికి తీవ్ర గాయాలు అయిన ఘటన పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పూనెం వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్ కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటి వద్ద వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. ముందుగా జానంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం మణుగూరులోని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టేకులపల్లిలో నూతన గ్రంథాలయ భవనానికి ఘనంగా శంకుస్థాపన

❖ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొనడం

❖ విద్యార్థులు, యువతకు ఆధునిక గ్రంథాలయ సౌకర్యాలు కల్పిస్తామని హామీ

దశ, టేకులపల్లి : టేకులపల్లి మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ (ఐఏఎస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రంథాలయాలు సమాజ అభివృద్ధికి, విద్యార్థుల విజ్ఞాన వికాసానికి, యువత పోటీ పరీక్షల సన్నద్ధతకు కీలక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన గ్రంథాలయ సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, పుస్తక ప్రియులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ నూతన గ్రంథాలయ భవన నిర్మాణాన్ని చేపట్టామని, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ శ్రీదేవి, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఖాదర్ బాబు, ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ప్రజాప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో చురుగ్గా మల్కా ప్రకాష్.. 662 దరఖాస్తులు పూర్తి

దశ, ఓయూ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు మల్కా ప్రకాష్ విస్తృతంగా కృషి చేస్తున్నారు. కార్యక్రమం ప్రారంభమైన తొలి రోజు నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు పార్టీ శ్రేణులకు ఎప్పటికప్పుడు పూర్తి అవగాహన కల్పిస్తున్నారు.ఇప్పటివరకు ఆయన స్వయంగా 662 దరఖాస్తులను నింపించి, ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రాముఖ్యతను వివరించారు.ప్రతి కాలనీలో ప్రజలను సంప్రదిస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకునేలా నిరంతరం కృషి చేస్తున్నారు. నిశ్శబ్దంగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న మల్కా ప్రకాష్ సేవలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. "పదవి వల్ల గుర్తింపు కాదు.. ప్రజల కోసం, పార్టీ కోసం నిరంతరం చేసే సేవే నిజమైన గుర్తింపును తీసుకొస్తుంది" అనే మాటకు ఆయన చేస్తున్న సేవలు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

కుటుంబ సంక్షేమంపై అవగాహన..

❖ విశిష్ట సేవలందించిన ఆరోగ్య సిబ్బందికి సత్కారం.

దశ, రంగారెడ్డి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయం, శివరాంపల్లిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి హాజరుకాగా, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి మాట్లాడుతూ, జనాభాలో వచ్చే మార్పులు,కుటుంబ సంక్షేమం, మహిళల ఆరోగ్యం, తల్లిశిశు సంరక్షణ వంటి అంశాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అనవసర గర్భధారణలను నివారించడం, ప్రసవాల మధ్య తగిన విరామం పాటించడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు కూడా బలోపేతం అవుతాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న కుటుంబ నియంత్రణ సేవలు, గర్భనిరోధక పద్ధతులు, ప్రసవానంతర కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ చేరుకుని ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఆరోగ్యవంతమైన కుటుంబమే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలులో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గర్భిణిని నమోదు చేయడం, తల్లి శిశు ఆరోగ్య సేవలు అందించడం, కుటుంబ నియంత్రణపై నిరంతర అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమం ముగింపులో కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో విశిష్ట సేవలు అందించిన వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి ప్రశంసా పత్రాలు, అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

వారి సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో ప్రజారోగ్య సేవలను అందించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని అభినందించారు. అవార్డులు అందుకున్న అధికారులు,సిబ్బంది ఈ గుర్తింపు తమలో మరింత బాధ్యత, ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమాధికారులు డా.షీబా హయాత్, డా. రాధిక, డా. పాపారావు, డా. రాకేష్, డా. జ్యోతిబాయి, జిల్లా విస్తరణ మరియు మాధ్యమ అధికారి (DEMO)మంజుల,జిల్లా మాస్ మీడియా అధికారి కె. శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 18 నుండి 20 వరకు విశ్వకర్మల సామూహిక బంద్..

❖ పనుల ధరల పెంపు, వృత్తి రక్షణకై హుజురాబాద్ విశ్వకర్మ మనుమయ సంఘం నిర్ణయం..

❖ 20వ తేదీన శాంతియుత ర్యాలీ..

దశ హుజురాబాద్: ప్రస్తుత జీవన విధానంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, కార్పొరేట్ కంపెనీల పోటీ కారణంగా విశ్వకర్మల వృత్తి తీవ్ర భారంగా మారిందని, ఉపాధి లేక కులవృత్తి దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విశ్వకర్మ మనుమయ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. హుజురాబాద్ ప్రెస్ క్లబ్ లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విశ్వకర్మల సమస్యల పరిష్కారం, సంఘం అభివృద్ధి, పనుల రేట్లను పెంచుకునేందుకు గానూ ఈ నెల 18 (శనివారం) నుండి 20 (సోమవారం) వరకు మూడు రోజుల పాటు సామూహిక బంద్ నిర్వహించనున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షులు నందగిరి శ్రీనివాస్ తెలిపారు. ఈ బంద్ సందర్భంగా జూలై 18వ తేదీన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ నిర్ణయించిన నూతన ధరల పట్టికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బంద్ ముగింపు రోజైన జూలై 20వ తేదీన విశ్వకర్మల సమస్యలపై శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

సంఘం నిర్ణయించిన ఈ బంద్‌కు విశ్వకర్మ సోదరులందరూ తప్పనిసరిగా సహకరించాలని, ఎవరైనా సంఘం నిర్ణయాన్ని ధిక్కరించి పనులు చేపడితే వారిపై సంఘం పరంగా కఠిన చర్యలు ఉంటాయని అధ్యక్షులు నందగిరి శ్రీనివాస్, సంఘ కమిటీ సభ్యులు హెచ్చరించారు. బంద్‌ను విజయవంతం చేసి విశ్వకర్మల ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశ్వకర్మ మనుమయ సంఘం నాయకులు రావుల వేణు,రాంపల్లి బిక్షపతి,నాయకులు,సత్యనారాయణ, సదానందం,రమేష్, ఉప్పల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోటు వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి: వ్యవసాయశాఖ

దశ, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలో జూలై 17, 2026 నాటికి మొత్తం 2,41,576 ఎకరాల్లో పంటలు సాగు కాగా, సాధారణ సాగు విస్తీర్ణం 3,94,762 ఎకరాలు ఉంది. ఇంకా 1,53,186 ఎకరాల్లో పంటల సాగు జరగాల్సి ఉందని జిల్లా వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ జూన్ నెలలో సాధారణ వర్షపాతం నమోదవడంతో రైతులు విత్తనాలు వేశారు. అయితే జూలై నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు.

జూలై 17 వరకు లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక కంది రకాలు, ఆముదం, చిరుధాన్యాలు, మేత జొన్న, అనుములు, బొబ్బర్లు, ఉలవలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా బెండ, టమాట, కొత్తిమీర, ఆకుకూరలు వంటి స్వల్పకాలిక కూరగాయల సాగు చేపడితే తక్కువ సమయంలో మెరుగైన నికర ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, నీటి కుంటలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. ఈ పనులను *మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS)*తో అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ సంబంధిత సలహాల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారి లేదా ఎంపీడీవోలను సంప్రదించాలని, జిల్లాలో రసాయన ఎరువుల కొరత లేదని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

కాసర్ల రాజేశ్వరికి రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దశ, పెద్ద అంబర్ పేట : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో కాంగ్రెస్ నాయకుడు కంచర్ల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాసర్ల రాజేశ్వరికి ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నుంచి రూ.36,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు లబ్ధిదారురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పేదలు మరియు అవసరమైన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందించేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాసర్ల రాజేశ్వరి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కంచర్ల సత్యనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వ్యాఖ్యలపై విచారణ జరపాలి: ఏబీవీపీ

దశ,ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం వార్షికోత్సవ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై నిష్పాక్షిక విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఉస్మానియా యూనివర్సిటీ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు గెల్లు శేఖర్, కార్యదర్శి గుడూర్ మోక్షిత్ మాట్లాడుతూ.. జూలై 7, 8, 9 తేదీల్లో ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం నక్సలైట్ల గురించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రముఖ విద్యాసంస్థకు ప్రిన్సిపాల్‌గా ఉన్న వ్యక్తి విశ్వవిద్యాలయ వేదికపై వివాదాస్పద లేదా రాజకీయ స్వభావం కలిగిన వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు. విద్యాసంస్థలు విద్య, పరిశోధన, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా ఉండాలని, వివాదాస్పద భావజాలాలకు లేదా రాజకీయ ప్రచారానికి వేదికలుగా మారకూడదని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై విశ్వవిద్యాలయం నిష్పాక్షికంగా విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత అధికారిపై తగిన పరిపాలనా చర్యలు తీసుకోవాలని వైస్ ఛాన్సలర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ కార్యదర్శి పృథ్వితేజ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, మోహన్ బాబు, పృథ్వి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబంలో మెరిసిన నీట్ విద్యార్థి మోడెం మేఘన

దశ, బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోతే పట్టి నగర్ గ్రామం మోడం మేఘన నీట్ పరీక్షల్లో సీటు సాధించి పేదరిక కుటుంబంలో వెలుగులు నింపింది. కష్టపడే తత్వం పట్టుదల ఉంటే ఆర్థిక ఇబ్బందులు విజయానికి అడ్డుకావని మరోసారి నిరూపించింది. మోడెం మేఘన. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది.మేఘన తల్లిదండ్రులు మోడెం వెంకటేశ్వర్లు, వెంకటరమణ . నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని నిరంతర శ్రమతో ఈ విజయాన్ని సాధించింది.మేఘన పదో తరగతిని సారపాకలోని ఎంఎస్ఆర్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసింది. అనంతరం భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి అత్యధిక మార్కులు సాధించింది. అదే క్రమశిక్షణతో నీట్ పరీక్షకు సిద్ధమై విశేష ప్రతిభ కనబరిచింది.మేఘన విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. మేఘన మామయ్య నాని మాట్లాడుతూ పై చదువులు చదవాలని ఆలోచన రావడమే కష్టమైన పరిస్థితులలో మేఘన డాక్టర్ కావాలని మక్కువ పెంచుకొని పట్టుదలతో కష్టపడి సాధించిన విజయం కుటుంబానికి తమకి మాఊరికే సంతోషకరమని ఈ సంతోషాన్ని మాటలలో చెప్పలేం అంటూ కొనియాడారు. మేఘన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

నాచారం కార్తికేయ నగర్‌లో అసంపూర్తి రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించిన బీజేపీ నాయకులు

దశ, ఓయూ : నాచారం డివిజన్‌లోని కార్తికేయ నగర్‌లో గత రెండు నెలలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు మరియు డ్రైనేజీ పనుల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు శుక్రవారం కార్తికేయ నగర్ వీధిని సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన వెంటనే GHMC నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ కి ఫోన్ చేసి పనుల ఆలస్యంపై ప్రశ్నించారు. ఆయన వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజల సమక్షంలో 7 రోజులలోపు రోడ్డు మరియు డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా పనులను మధ్యలోనే వదిలేయడం సరైంది కాదని, వెంటనే పనులను పూర్తి చేసి కార్తికేయ నగర్ ప్రజలకు ఉపశమనం కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. SIR ఫారమ్‌ల పంపిణీలో పాల్గొన్న నాయకులుఅనంతరం మల్లెల నర్సింగ్ రావు నాచారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించి SIR ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి. చంద్రమౌళి, ప్రకాశ్, అభిషేక్ గౌడ్, దయా గౌడ్, రమేష్ గౌడ్, నవీన్ రెడ్డి, ఆనంద్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.